# వియద్గంగ

'ఆమె రావాలని ఎంత కోరుకుంటున్నాడో,... రాకూడదని అంతగా అనిపిస్తోందా?'... ఆలోచిస్తున్నాడు కశ్యప్.

నిరీక్షణ... వచ్చే మనిషి ఉనికి వల్ల అది తియ్యగానో, బాధగానో, భయంకరంగానో ఉంటుంది... విషయం ఎంత స్వచ్ఛమైనదైనా మన భావవలయాల ఉచ్చు స్వచ్ఛమైన వాటి చుట్టూ ఆవరింపచేసి రూపం, రంగు, భావం - అన్నీ ఆపాదించి... మళ్ళీ అదే మన సమస్య అనుకుంటాము.

మందాకిని కోసరం ఈ నిరీక్షణ... ఇది బాధగా ఉన్నదా లేదా అంటే... చెప్పలేని స్థితి.

బీరువాలో అడుగున దాచిన చెల్లెలు రాణి ఉత్తరం... అతని ఊహల్లో రెప రెపలాడుతోంది.

'ఆ మహాతల్లి పేరు మందాకిని... మా ఆయనగారి పై ఆఫీసరు... విధవ. ఆవిడ మోజులో పడి రాజా నన్ను, సంసారాన్నీ, బాధ్యతల్నీ... అన్నీ మర్చిపోయారు... విపరీతంగా తాగుతున్నారు. అన్నయ్యా!... మీ ఇద్దరు కృష్ణార్జునుల్లా ఉండేవారు... అందుకే నన్నిచ్చి రాజాకు పెళ్ళి చేశావు... నా సంసారం నిలబెట్టే బాధ్యత నీదే... నన్నెంత గారాబంగా పెంచావన్నయ్యా! నాకిప్పుడు చచ్చిపోవాలనుంది..."

ఇవి రాణి రాసిన సుదీర్ఘమైన లేఖలో అక్కడక్కడ ఉండే కొన్ని వాక్యాలు... వాటిల్లో బాధ, అమాయకత్వం, ఇంపల్సివ్‌నెస్... చాలా ఉన్నాయి.

అన్నగారుగా చాలా బాధ పడుతున్నాడు కశ్యప్.

గ్రాడ్యుయేట్ అయి ప్రపంచ జ్ఞానం బొత్తిగా లేని అమాయకురాలైన చెల్లెల్ని చూసి మనిషిగా జాలిపడుతున్నాడు.

కానీ, రాజా కోసరం దుఃఖపడుతున్నాడు కశ్యప్.

"ఈ ఉత్తరం టెలిగ్రాంగా భావించి బైలుదేరిరా" అని రాసింది చెల్లెలు.

కానీ వెళ్ళలేదు. వెళ్ళడం వలన ప్రయోజనం ఉండదని తెలుసు; దుఃఖంలో తోడు, సానుభూతి అవసరం ఉండచ్చు. కానీ తన బలహీనతలు తప్పు అన్నవాళ్ళను, అడ్డం వచ్చిన వాళ్ళను ముందు శత్రువుల్లాగా చూస్తాడు మామూలు మనిషి. అందులో రాజాలాంటి సెన్సిటివ్ వ్యక్తి అసలు భరించలేనిది "మంచి స్నేహితుడి దగ్గర నుంచి వచ్చే హితవచనాలు..."

అందుకే వివరాలు సేకరించాడు...

ఈ మందాకిని ఎవరో కానీ... రాజా చాలా ప్రలోభంలో ఉన్నాడు. ఆవిడ ప్రభావం అతణ్ణి తాగుబోతుగాను, బాధ్యతలు మర్చిపోయేవాడిగానూ చేసింది. స్నేహాలను, ఎఫైర్స్‌ను భరించి అర్థం చేసుకోలేని స్థితిలో లేడు కశ్యప్... కానీ, దేని పరిణామమైనా కానీ, మనిషి, అతని ఔన్నత్యాలను దిగజారుస్తూ ఉంటే మాత్రం అదెంత గొప్పదైనా గౌరవించక్కర్లేదన్న విషయం కశ్యప్‌కు తెలుసు.

తను వేసే ప్రతి అడుగు తూచి వెయ్యాలని తెలుసు అతనికి. విషయస్ఫూర్తి, సమయస్ఫూర్తి – ఈ రెండూ ఉండాలి.

మందాకిని వైజాగ్ కాంపు మీద వచ్చిందని తెలిసి వెళ్ళి పరిచయం చేసుకున్నాడు... డిన్నరుకు ఆహ్వానించాడు.

వెంటనే ఒప్పుకున్నది ఆమె.

ఆలోచనలలోనించి చటుక్కున తలెత్తి చూశాడు కశ్యప్ కారు శబ్దానికి.

ఆమె కారులోనించి దిగుతోంది.

ఆవిడలో ఒక ప్రత్యేకత ఉంది. ఏ వాతావరణంలోనైనా కలిసిపోయినట్లే ఉంటూ, తనకు తనుగా విడిగా కనిపిస్తూనే ఉంటుంది.

మర్యాద పరదాలు చుట్టుకున్న బోలెడన్ని ఓటి మాటలు. "మీ శ్రీమతిగారు ఊరెళ్లారన్నారు... కానీ మీ ఇల్లు చాలా నీట్‌గా శుభ్రంగా..." అన్నది అతని కళ్ళల్లోకి సూటిగా చూస్తూ మందాకిని.

ఆ ధ్వనికి నవ్వుకున్నాడు కశ్యప్... 'సమర్థురాలైన స్త్రీమూర్తికి సాధారణంగా భర్త హోదాల వెనకాల బ్రతికే భార్యల గురించి ఒక తమాషా భావన ఉంటుంది. ఇల్లాళ్లతో మాట్లాడితే మెచ్చుకోగలరు... వారు లేనప్పుడు వెటకారం ధ్వనించగలరు.

"నాకు ఇలా ఉండటం ఇష్టం... నా ఇష్టాలకోసరం మరొకరిమీద ఆధారపడే తత్వం నాకు లేదు..."

"గుడ్... చాలా మందిలా శుచికి, రుచికి, శుభ్రానికి మరొకర్ని బాధ్యుల్ని చెయ్యరన్నమాట..." నవ్వేస్తూ అన్నది మందాకిని.

ఈవిడతో అసలు విషయం ఎలా మాట్లాడాలో అర్థంకావడం లేదు కశ్యప్‌కు.

ప్రతి మనిషిని ఉలిక్కిపడేట్లు చేసే కొన్ని విషయాలుంటాయి. అవి మనిషి బలహీనతలవచ్చు... స్ట్రాంగ్ పాయింట్లు కావచ్చు.

మరి ఈవిడను స్పందింపచేసేవి ఏమిటట?!

సాధారణంగా సౌందర్యవతికి ఉండే సౌందర్య పిపాసా?!

ఏ మాత్రం సున్నితత్వం ఉన్నా కోరుకునే గుర్తింపు, ఆరాధనా?! లేక బాధ్యత లేని తేలిక సుఖాలా?!

అంత తొందరగా దొరకడం లేదు మందాకిని మాటలకు...

'రాగచ్ఛాయల్లో ఇమడని ఆలాపన ఆమె. కొంపదీసి దొరకదని తెలిసినా దేనికోసమో అన్వేషణా?! ఏమిటది?!

ఆమె శారీరక పక్వంలో జీబుగు ఉన్నది; లాలస లేదు. ఆమెకు సౌందర్యవతినని తెలుసు; కానీ ప్రశంసించినప్పుడు చాలా సున్నితంగా మాట మారుస్తున్నది... ఆ ప్రయత్నంలో నిజాయితీ ఉన్నది.

"మీరు కళాకారిణులా? ఏదైనా ఆర్ట్ అంటే..."

"అవ్వే లేదండీ! If appreciation is the greatest art, I am an expert in it..." అన్నది.

భగవంతుడు చాలా గొప్ప అబ్స్ట్రాక్ట్ సబ్జెక్ట్... అలా ప్రయత్నిస్తే?!

ఆ విషయం వైపు సంభాషణ తిప్పాడు.

"నాకు అర్థం కాని చాలా విషయాలకు కారణం భగవంతుడనుకుంటాను. That is an answer to my question. It is not by itself a question-" అన్నది.

మెల్లిగా అలా మాటల అడ్డుగోడలు దాటారిద్దరూ... లాన్‌లో కుర్చీల్లో కూర్చుని, దోరగా వేయించిన జీడిపప్పు నోట్లో వేసుకుంటూ, క్రిస్టల్ గ్లాసులో వట్టివేరు, పచ్చకర్పూరం కలిపిన నీటిని సిప్ చేస్తూ మాట్లాడడం... "ఇదేమిటి?" అని తౌక్యం ఊహను నిలబెట్టి ప్రశ్నించకుండా గడిపెయ్యగలిగిన కొన్ని గంటలు... చాలా గొప్పవి... అటువంటి క్షణాలు దాచుకోగలిగిన అదృష్టవంతులు చాలా చాలా తక్కువ మంది. ఫలితం ఏదన్నా కావచ్చు... ఆమె సాన్నిధ్యం గొప్ప అనుభవం.

అదేమిటో విశ్లేషించుకుంటున్నాడు. కశ్యప్ లోలోపల. The greatest blessings come by way of madness... indeed of madness that heaven seat..." అన్నాడు సోక్రటీస్.

రాజారావు నిజంగా ఈవిడ అపరిమిత స్నేహాన్ని పొంది ఉంటే, ఒక రకంగా అదృష్టవంతుడు.

కానీ... ఈ కాసేపట్లో ఒకటి అర్థమైంది కశ్యప్‌కి; అతడు ఆమెను అతిగా ఇష్టపడి, దగ్గర అవలేక వ్యసనానికి బానిస అయి ఉండాలి... ఎందుకంటే, ఎవరూ ఈవిడకు ఎదురుపడి "నువ్వు నా దానివి..." అని అనలేరు... అది మాత్రం నిజం...

మరి ఈవిడ?!

పరిస్థితి ఎటువంటిదైనా, కశ్యప్‌లాంటి వ్యక్తి కేవలం చెల్లెలి కన్నీళ్ళు మాత్రమే ఆలోచించలేడు. 'మందాకిని మంచి కూడా ఆలోచించగలడు.' కానీ రాజా, మందాకినిల స్నేహఫలితం గొప్పగా లేదు... రాజా సర్వనాశనమైపోకముందే జాగ్రత్త పడాలి... బావమరిది అనేకాదు... మంచి స్నేహితుడు కూడ అతను.

"ఊఁ" అని నిట్టూర్పు విడిచాడు కశ్యప్ ఆలోచిస్తూ... ఒక్కసారి తలెత్తి చూసింది మందాకిని.

అప్పటికే, అపరిచితుల మధ్య ఉండే మొహమాటం, స్నేహితుల మధ్య ఉండే సన్నిహితత్వం... ఈ రెండు స్థితులు దాటిపోయారు ఇద్దరు... అతని మాటల్లో

అంతర్గతంగా ఏదో ధ్వని తాటాకు ఛాయలు పట్టుకుందామని ఆమె కూడా ప్రయత్నిస్తోంది.

ఇంత స్నేహమయి, ఆకర్షణమూర్తికి ఎలా ఏమిటి తెలియచెప్పాలో అర్థం కావడంలేదు కశ్యప్‌కు.

"మీ పాప ఫోటోనా?" టేబిల్ మీద ఉన్న తెల్లటి ఫ్రాక్‌తో ఉన్న చిన్నపిల్ల ఫోటో చూస్తూ అడిగింది ఆమె.

"కాదు... మా చెల్లెలిది... వాణిది..." ఆమెనే చూస్తూ అన్నాడతను.

"నాకు తనంటే చాలా ఇష్టం మందాకినీ!... నాన్న, అమ్మ పోతే చాలా ప్రేమగా, గారాబంగా పెంచుకున్నాను..."

ఛటుక్కున తలెత్తి చూసి, ఆ ఫోటోనే తదేకంగా చూస్తూ-

"మీ చెల్లెలు రాణి అదృష్టవంతురాలు. మీలాంటి అన్నగారు, రాజారావుగారి లాంటి భర్త దొరికారావిడకు..." అన్నది.

ఆ గొంతులో అణుచుకుంటున్న ప్రకంపన.

మళ్లీ గభాలున మామూలుగా: "నిజానికి వీళ్లిద్దరు మీ గురించి మాట్లాడని రోజు ఉండదు. అందుకే.. మీరు ఎలా ఉంటారా అని చూడాలనే పిలవగానే వచ్చాను..." నవ్వేస్తూనే అన్నది.

"ఎనీ రిగ్రెట్స్?" సూటిగా చూస్తూ అడిగాడు కశ్యప్.

"అబ్బే... లేదు... ఎక్కువగా మీ గురించి వాళ్ళిద్దరికీ చాలా చాలా తక్కువ తెలుసేమోననిపిస్తోంది నాకు ఇప్పుడు..."

"థాంక్స్... మీకు మనుష్యుల గురించి స్టడీ ఎక్కువేమో..." పరీక్షగా చూస్తూ అన్నాడు.

"అవును... నా ఒంటరితనం నన్ను ఒదిలెయ్యలేదు... అబ్జర్వేషన్ నేర్పింది..." ఆమె నవ్వినప్పుడు ఆ కాటుక కళ్ళకింద సన్నటి గీతలు.

స్త్రీత్వపు పరిధులు దాటి ఎదుగుతున్న సమయంలో సెక్స్‌లెస్ సౌందర్యం వుంటుంది. ఆ విషయం అర్థమైన ఆడవాళ్ళు చాలా తక్కువమంది. మందాకిని ఆ స్థితి అర్థంచేసుకున్నది.

"మీరు మరోలా అనుకోకపోతే మీరు మళ్ళీ పెళ్ళి ఎందుకు చేసుకోలేదు మందాకినీ?"

ఆమె మాట్లాడలేదు - మునివేళ్ళ మధ్య అతను కోసిచ్చిన విచ్చీ విచ్చని రోజా మొగ్గ, సున్నితంగా, ముద్దుగా, అలవోకగా...

"చెప్పడం ఇష్టం లేకపోతే..."

"అబ్బే అదేం లేదు... నా వైవాహిక జీవితం అంత గొప్పగా లేదు. నాకు ఆ అనుభూతిలో అందం కనిపించలేదు. అందుకే, అతను చనిపోయిన తరవాత మళ్ళీ కమిట్ అవడం అనవసరం అనిపించింది..."

"ఓ... సారీ... అసలు ఈ పెళ్ళిళ్ళు ఇలా అయిపోవటానికి ఈ కాన్సెప్టుకు మన దేశంలో మనం ఇచ్చే గౌరవానికి, మనిషికి కావలసిన స్వేచ్ఛకు మధ్య ఏదో అగాధం ఉందనిపిస్తోంది..."

"అవును... ప్రపంచంలో చాలా చోట్ల అది అగ్రిమెంటు. మన దేశంలాంటి కొన్ని చోట్ల మాత్రం అది వ్యవస్థ... భర్త, భార్య అన్నవి మనుషుల భావాలమీద కన్న ప్రోటోకాల్స్ ఉన్న పదవుల్లా మారిపోయాయేమో..."

"అవును... ప్రకృతి సిద్ధమైన చట్టాలకు, మనిషి తయారు చేసే చట్టాలకు చాలా తేడా ఉంది..." వంటమనిషి తెచ్చిన డిన్నరు ప్లేట్లలో సర్దుతూ అన్నాడు కశ్యప్.

లాన్‌లో ఆకుపచ్చటి చీకటిలో ఎఱ్ఱటి గార్డెన్ టేబుల్ మధ్య తెల్లటి పాలరాయి శిల్పంతో మలచిన దీపకన్య... అతని అభిరుచిని గమనిస్తోందామె... ఇటువంటి మనిషికి ఎటువంటి చెల్లెలు?!

ఆమెనే గమనిస్తున్నాడు క్రీగంటన కశ్యప్. తెల్లటి చీరమీద ఎఱ్ఱ రోజాపూవుల ఎంబ్రాయిడరీ... ముత్యాలనగలు... ఆమె ఆ చక్కటి వాతావరణంలో ఇమిడిపోయినట్లు... విశ్వ విపంచిలో లయించిపోతున్న హ్రీంకార నాదంలా, సూర్యాస్తమయంలో కలిసిపోతున్న కాంతిరేఖలా, తమాషాగా ఉన్నది.

"అదేమిటి? మీరు భోజనం చెయ్యరా?" అరిటిపళ్ళు, పాలు తాగి సరిపెట్టుకుంటున్న అతణ్ణి చూస్తూ అడిగింది.

"అవును."

"ఎందుకని? డైటింగ్?"

"కాదు"

"మరి?"

"నవ్వనంటే చెప్తాను..." నలభయ్యేవ పడిలో ఉన్న అతని నవ్వులో స్వచ్ఛత ఉన్నది.

"ఛా! ఛా! చెప్పండి..."

"మొక్కు"

"మొక్కా? యు మీన్..."

"అవును... మనం ఏదన్నా కోరుకుంటే, ఏదో మనకు చాలా ఇష్టమైనది ఇవ్వాలి, కష్టమైనది చెయ్యాలన్నది ప్రకృతిసిద్ధమైన చట్టం... బహుశః ఈ మొక్కుకు అదేనేమో అర్థం... మనం సులభంగా చెయ్యగలిగినదాన్ని ముడుపు కట్టడంలో అర్థం లేదేమో..."

"అంటే..." ఆలోచిస్తూ అడిగిందామె... ప్రశ్న ఎలా ఉన్నా, అతని మాటల్లో అంతరార్థానికి వెతుకులాట అది.

"మీరు డగ్లాస్ రాసిన 'మాగ్నిఫిషియంట్ అబ్సెషన్' చదివారా?!"

"లేదు."

"చాలా గొప్ప నవల... ఒక డాక్టరుగా అది దాదాపు నాకు భగవద్గీత లాంటిది... ఒక మనిషిలో దాక్కున్న గుప్త శక్తులు ఉదాత్తమైన స్థితిని పొందాలంటే, నిస్వార్థ తత్వంతో కూడుకున్న ఒక్క క్రియ చాలు అంటాడు... చాలా గొప్ప పుస్తకం... తప్పకుండా చదవండి..."

"ష్యూర్... కానీ, మీరు చెప్పే మొక్కు..."

"అదేనండీ! నాకు తిండి వీక్‌నెస్... అందుకనే, నేను చాలా ఇష్టమైనదాన్ని దూరంచేసుకుని, నేను ప్రార్థిస్తున్నదాన్ని పొందాలని నా ప్రయత్నం..."

ఆ చీకటి చీల్చుకుని ఆమె చూపులు అతణ్ణి ప్రశ్నిస్తున్నాయి. అతని మాటల్లోని ధ్వని తరంగాల్ని అనువదించాలని ప్రయత్నిస్తున్నాయి. అంతర్గతంగా ఉన్న భావ సౌందర్యాల యవనికలు చీలుస్తున్నాయి.

"మీరు ఇంత ప్రయత్నం చేసేది దేనికోసరం డాక్టర్?" అడగక తప్పని ప్రశ్న.. ఆమె గొంతులో సన్నటి జీర.

"నా చెల్లెలు సాంసారిక జీవితంలో సుఖంగా ఉండాలని నా ప్రయత్నం... మందాకినీ!... రాజా నా ప్రాణం... వాళ్లిద్దరూ హాయిగా ఉండాలి..." తలవంచుకుని అరచేతిలో కనబడని రేఖలు వెతుక్కుంటున్నాడు కశ్యప్.

అతనివంకే చూస్తోంది మందాకిని.

ఆమె కళ్లల్లో తడి... అతనికి కనిపించదు అనుకుంటోంది మందాకిని.

ఆమె గుండెల్లో హోరు... అతనికి వినిపించదు. అనుకుంటోంది ఆమె...

మౌనం చాలా మాట్లాడింది కొద్ది క్షణాలు.

చేతిలో ఉన్న గాజు ప్లేట్లో గీతలు గీస్తూ కూర్చుంది ఆమె.

రెండు చేతుల మధ్య గడ్డం పెట్టుకుని ఆమెనే సునిశితంగా చూస్తున్నాడతను.

మెల్లిగా ఆమె దృష్టి గడియారం వైపు తిరిగింది. అప్పటికే ఆమె వచ్చి మూడు గంటలు దాటింది.

❀ ❀ ❀

"డియర్ డాక్టర్!"

లేతగులాబీ రంగు ఉలిపిరి కాగితం మీద ముత్యాలసరాల్లాంటి అక్షరాలు...

మందాకిని ఉత్తరం.

అతనికి తెలుసు ఆమె రాస్తుందని...

చదవడం ప్రారంభించాడు:

"మీకు తెలుసు నేను ఉత్తరం రాయకుండా ఉండలేనని... కారణం మనిద్దరికీ తెలుసు...

మన పరిచయం స్నేహం పరిధి కూడా దాటి మనసు, మేధస్సు కూడా స్పృశించలేని ఒక తెలియని అధి భౌతికస్థితికి చేరిపోయింది.

ఈ మీ పరిచయం నా జీవితంలో చాలా గొప్ప మలుపు తెచ్చింది... నా తప్పులు సమీక్షించుకునే స్థితికి ఎదిగాను.

ఈ విషయం నిజాయితీగా ఒప్పుకోవాలంటే, ఒకప్పటి మందాకినికి అసలు అవకాశము, అవసరము కూడా లేదు...

కానీ... ఇప్పుడు...?!

మారిన మందాకిని ఒప్పుకుంటోంది...

దీనికి కారణం?!

ఒద్దనుకున్నా కొన్ని విషయాలకు తలవంచాలి...

'నిశ్చలమైన నిర్మలమైన భావనకు చాలా బరువు ఉంటుంది. బాంధవ్య మేర్పరుస్తుంది... ఎదటి వ్యక్తి సబ్‌కాన్షియస్ స్థితిని కలియపరచి, నిక్షిప్తమైన అనేక ఆలోచనా సరళుల మధ్య చిక్కుకున్న అంతరంగికమైన చైతన్యాన్ని అద్భుతంగా నిద్రలేపుతుంది. మీరు ఆ 'స్థితి' నాకు తెలియపరిచారు.

ఈ థియరీని ఇప్పుడు ఒప్పుకుంటున్నాను... ఇంతకాలం, అర్థంలేని 'ఇగో'తో నా జీవితంలో నాకున్న కొన్ని లాలిత్యాలమీద నమ్మకంతో, ప్రపంచాన్ని చాలా ప్రలోభపరిచాను. పదహారో ఏట పెళ్లైన నేను ఇరవయ్యో ఏటకు భర్తను పోగొట్టుకున్నాను. అతను బ్రతికినంత కాలం భర్తగా నాకు వైవాహిక జీవితం మీద ఏమాత్రం గౌరవం మిగిల్చేట్లు ప్రవర్తించలేదు. నా అందం, నా సౌకుమార్యం, నా అభిప్రాయం – ఇవన్నీ కట్నం తీసుకుని కొనుక్కొన్నట్లు ప్రవర్తించేవారు అతను, అతని 'మంది.'

అందరికీ ఎదురు తిరిగి, చదువుకుని, ఆర్థికంగా స్వతంత్రురాల్నైనాను కాని అపారమైన స్వేచ్ఛతో, నాకు జీవితంలో దొరకని సంతృప్తిని ఇలా ఎదటి వ్యక్తులను ఊరించి అహంతో నవ్వుకున్నాను. ఊరించానే కానీ, చాలా తక్కువసార్లు ఊరడించాను. నన్ను పొందలేక వాళ్లు పడే తపన నాకు తెలియని శాడిస్టిక్ ఆనందాన్ని ఇచ్చేది.

కానీ ఈ చదరంగపు ఆటకు మించిన అందమైన, సుందరమైన లాలిత్యా లుంటాయని రాజాను చూసిన తరవాత అర్థమైంది నాకు. అతని స్నేహంలో నిజంగా చాలా హాయిగా ఉన్నాను నేను. ఆడదాని సౌందర్యానికి నమ్మకము, కొత్త జిలుగు కావాలంటే, ఎదటి వ్యక్తుల ఆరాధనే కారణమౌతుంది. అంత తియ్యటి తమకంలో ఉన్న నేను, అది నీహారిక అని ఎవరు చెప్పినా వినే స్థితిలో లేను... నా దగ్గరితనం వల్ల, అతను నన్ను పొందలేక, దూరమవలేక, చెప్పలేక బాధపడి తాగుబోతు అయిపోతున్నాడని తెలిసినా నేను బాధ పడలేదు.

కానీ... విచిత్రం... మీరు చాలా గొప్పగా, తెలివిగా, 'మొక్కు' అన్న మాటతో చాలా తెలియపరిచారు నాకు. మనకు అత్యంత ఇష్టమైన దాన్ని 'ముడుపు' కడితే మనలో జరిగే అంతర్‌మథనం వల్ల ఎదటివారి జీవితం, మనస్సు ఇన్‌ఫ్లుయన్స్

అవుతాయన్న థియరీ చాలా గొప్పది. జీవితంలో చాలా ఇష్టమైన దాన్ని ముదుపు కట్టుకుని, మనం కోరుకున్న వ్యక్తికి మేలుగా మార్చి, చాలా విలువైనదాన్ని పొందగలం అన్న సూత్రంలో ఆనందం నాకు అర్థమైంది.

``Our attitudes towards things reflect basic value judgements-'' అంటాడు *Alvin Toffler* Future shock లో...

మీ దగ్గర నుంచి వచ్చి, చాలా చాలా ఆలోచించాను. రాజా గురించి విచారించాను. అతను తాగుతూ సర్వనాశనమైపోతున్నాడు. మీ బాధ వెనకాల సిన్సియారిటీ నాకు అర్థమైంది. ఒకరకంగా మీకన్నా మానసికంగా నేను అతడికి దగ్గరదాన్నని అతడు అనుకుంటున్నాడు. మరి నా బాధ్యత మరింత ఎక్కువ కదా!

ఇంతకాలం నా ఆకర్షణ, నా ప్రత్యేకత ఎదటి వ్యక్తి మీద నాకు అధికారాన్ని మాత్రం ఇస్తుందనుకునేదాన్ని... కానీ, ఆలోచిస్తే అవతల వ్యక్తి జీవితానికి అది మనని బాధ్యుల్ని చేస్తుందని అర్థమై ఒణికిపోయాను... 'నాకేం సంబంధం?' అనుకోవడం నిజాయితీ లేనిమాట.

ఆలోచించాను... అతణ్ణి ఎలా రక్షించాలా అని మథన పడ్డాను. నాలోని 'అహాన్ని' మీ శిష్యరికంలో 'ముదుపు' కట్టాను. అతని సాన్నిధ్యం, అతని ఆరాధన పట్టనట్లు నటించాను. అతనికి విసుగు, కోపం వచ్చేటట్లు ప్రవర్తించాను. ఈ సున్నిత హృదయాలుండే భావుకులలో ఉండే పెద్ద బలహీనత ఇదే. చటుక్కున మనస్సు విరిగిపోతుంది... ఎంత తొందరగా స్పందిస్తారో, అంత తొందరగా, అంత ఆలోచన లేకుండా దూరమైపోతారు. నాలోని స్త్రీత్వానికి బానిస అవడానికి సిద్ధపడ్డ రాజా నాలో కనిపించిన నిర్లక్ష్యాన్ని భరించలేకపోయాడు. 'ఎందుకిలా మారింది ఈమె?' అని ప్రశ్నించుకోలేకపోయాడు. క్రమంగా నాకు దూరమైపోయాడు.

ఆఫ్‌కోర్స్... ఇదంతా చెయ్యడానికి, నేను చాలా మానసిక క్షోభ పడవలసి వచ్చింది. నా అహం మీద దెబ్బతగిలే మరొక విషయం కూడా అర్థమైంది. నన్ను కోరుకునే ఏ వ్యక్తీ 'నేనుగా ఏమిటి?' అని ఆలోచించడం లేదు... ఇది తెలుసుకుని, ఒప్పుకుని, తలవంచాలంటే... నాలాంటి మనిషికి చాలా కష్టం.

కానీ, ఏదో ఒక తృప్తి. అది ఆత్మకు సంబంధించింది. ఈ ముదుపు కట్టి, నేను జీవితానికి తృప్తి అని నేను అనుకున్న భావనకు దూరమైనా, మానసికమైన ఏదో తెలియని ప్రశాంతత, ఏనాడూ నాకు అర్థం కానిది నా జీవితాన్ని ఆవరించింది...

రాజా బాగుపడ్డారు. నేను చాలా రోజులు ఈ నటన సాగించలేను... అతనికి దూరంగా ట్రాన్స్‌ఫర్ చేయించుకుని వెళ్లిపోతున్నాను... చాలా పోగొట్టుకుని మరొక రకంగా చాలా తెలుసుకుని వెళ్లిపోతున్నాను.

తడిసిన రెక్కలతో, మంచు పర్వతాల ప్రాంతాలకు వలస వెళ్లక తప్పని పరిస్థితిలో ఉన్న నీటి కొంగలా ఉన్నది నా స్థితి.

నేను మీ దగ్గర నేర్చుకున్నది ఏమిటూ? అని సమీక్షించుకుంటున్నాను ఇప్పుడు. ఈ పద్ధతి కూడా మీ పరిచయం తరవాత అలవరుచుకున్నదే...

ఇప్పటి నా ఒంటరితనంలో క్షణాలను అనుభవాలుగా ఖరాబు చేసెయ్యాలన్న ఖంగారు లేదు. నా ఒంటరితనంలో హాయి ఉన్నది. తృప్తి ఉన్నది. ఏదో పొంది తృప్తి పొందడం అంటే అది అసంతృప్తి కిందే లెక్క. ఎవరి పరిచయం మీదనో, స్నేహం మీదనో ఆధారపడి తృప్తి తెచ్చిపెట్టుకుంటే, అది అహం సంతృప్తిపడగానే, టీటలువారి విసుగువేస్తుంది. ఇటువంటి తృప్తి వలన అవతలి స్నేహాన్నో, హోదానో, పదవినో, పరిస్థితినో పొగొట్టుకుంటానన్న 'భయం' మీద ఆధారపడుతుంది. అది ఊబిగా మారుతుంది. మన ఆనందానికి మరొక వ్యక్తి మీద ఆధారపడడం వల్ల మనలో ఒక రకమైన సంఘర్షణ, బాధ ఉంటాయి. తృప్తిగా ఉండే స్వేచ్ఛ మరొకరు ఇచ్చేది కాదు. తృప్తి అనేది లక్ష్యం కాదు. ఎప్పుడో పొందబోయే తృప్తిలో నిజం లేదు. మన ప్రస్తుతపు క్షణాలను తవ్వితీయడం వల్ల వచ్చే చీకటి నీడను కాలంతో కొలవడం అది...

మనని ఆవరించే `Passive awareness', ఏదో నిశ్శబ్దమైన ఆనందం.. ఇది గుర్తించడం నేర్చుకున్నాను.

మీరు ఒక అన్నగా రాణికి చాలా చాలా ఇచ్చారు. కానీ, నాకు గురుత్వంతో సరిగ్గా ఆలోచించగల జ్ఞానం అరణమిచ్చారు. ఇంతకన్న ఏం కావాలి?

'సర్వం ఖల్విదం బ్రహ్మ' అని చెప్పడానికి ఉపనిషత్తులు చాలు డాక్టర్... కానీ, మాయలో ఉంటూ, మాయాతీతమైన మానసిక స్థితికి చేర్చగలిగిన మహోన్నత విద్య–

ఇది నాకు తెలియపరిచిన మీకు

నా ప్రణామాలు

మందాకిని."

అతని చేతుల్లో కాగితాలు రెప రెపలాడుతున్నాయి. అతని కళ్లల్లో తడి... అతి సున్నితంగా, 'ప్రాణమున్న అక్షరాలు' కాగితాలమీద స్పందిస్తున్నట్లుగా దాచుకున్నాడు ఆ ఉత్తరం కశ్యప్.

ఆ మరునాడు సాయంత్రమే రాజా కాంప్ మీద వచ్చాడు... ఒద్దన్నా వారిద్దరి మధ్యా మందాకిని నీడ...

"నో డౌట్... మందాకిని చాలా గొప్ప మనిషి. కానీ ఎదుటి వాళ్ల 'ఇగో' ను హర్ట్ చేస్తుందిరా... ఛత్ అనిపించింది... అందుకే దూరంగా పెట్టాను. పాపం... చాలా ఆలోచించి ఉంటుంది నేను ఎందుకిలా అయ్యానా అని! కానీ అంత అహంకారాన్ని ఎవరు భరిస్తారురా? నీ చెల్లెలిది అజ్ఞానం. అదే నయం కొంతవరకు. ఓ.కే. ఫర్‌గెట్ ఎబౌట్ ఇట్. నీదగ్గరవుండాలట మీ చెల్లెలు. ఫ్లాట్ ఒకటి కొందాం

చూడు. ట్రాన్స్‌ఫర్‌కు ట్రై చేస్తాను." చాలా మామూలుగా సోఫాలో ఒక మూలకు కాలి మీద కాలేసుకుని కూర్చుని, మాట్లాడేస్తున్నాడు రాజారావు.

ఆలోచిస్తున్నాడు కశ్యప్ అతనివంకే చూస్తూ.

ఎంత గొప్ప మనిషైనా, "నాది" అనుకునేటప్పటికి ఆ మనిషిలో చలనము, చైతన్యము, దీప్తి, నిర్దేశికత ఉంటాయని ఒప్పుకోలేక, తను సంపాదించుకున్న ఖరీదైన వస్తువులా అప్పుడప్పుడు ఎగ్జిబిట్ చేస్తూ, ఏడు తాళాలు వేసి దాచెయ్యాలనుకుంటాడు మనిషి.

ముఖ్యంగా బలహీనత, భావుకత ఉన్న ప్రేమికుడు. అవతలి మనిషి తన స్వస్వరూపాన్ని బయటపెట్టడం ప్రారంభించగానే, భరించలేక, భయపడి "నేను" అన్న అహంతో అఘాయిత్యం ప్రారంభిస్తాడు. అదే జరుగుతోంది రాజాలో... ఇష్టం వచ్చినట్లు మాటలు కొట్టి పోస్తున్నాడు మందాకిని గురించి... తనకు దొరకనిది అదేమంత గొప్పది కాదులే అన్న ద్రాక్షపళ్ల నక్క మనస్తత్వానికి జాలివేస్తోంది కశ్యప్‌కు.

కశ్యప్‌లో నిజాయితీ నిజం చెప్పెయ్యమంటోంది. కానీ, మమకారానికీ, వాస్తవానికీ, అనుభవానికీ, అనుభూతికీ మధ్య ఏవో తెలియని పలుచని పొరలుంటాయి.

"స్త్రీ ఆనంద రూపమే... కానీ వ్యసనమైనప్పుడు అది మనిషి స్వభావాన్ని మలినం చేస్తుంది... నన్ను చేసింది... నిర్మలమైన ఆనందం కాక, ఇంక ఏమిచ్చినా... ఆ సందర్భంలో, ఆ యత్నంలో మాలిన్యమున్నదన్నమాట..." అన్న "చలం ఉత్తరా"ల్లోని వాక్యం గుర్తుకు వచ్చింది... అందుకే మాట్లాడలేదు కశ్యప్.

అంతేకాదు... నిజం చెప్పినా, ఆమెలోని మానసిక పరిణతిని గురించి చెప్పినా, అది తనకు ఎంతవరకు సంబంధించింది? అని ఆలోచించగలడే కానీ, రాజాలాంటి మనిషి "ఆమె ఏమిటి? ఏమౌతోంది? ఎటు మార్పు చెందుతోంది?" అని ఆలోచించ లేడు. అతనిలో ఆరాధకుడు నిర్మలమైన స్నేహశీలి స్థితికి ఎదగలేదు.

"మేధస్సుతో కాక, మనసుతో ఆలోచించేటప్పుడు ప్రగాఢమైన లోతుల అంతర్యపు అతి సూక్ష్మ మహా ప్రకంపనలను గురించి ఆలోచించలేరు... ఉపరితలాన్ని స్పృశించగలరు... అంతా..." మందాకినిలో జరిగిన మెటామార్ఫొసిస్ రాజాకు అర్థం కాకపోవచ్చు.

అందుకే ఊరుకున్నాడు కశ్యప్.

"అన్నయ్యా! మా అబ్బాయి పుట్టిన రోజుకు వచ్చేటప్పుడు నాకు నెమలి పింఛం రంగు పట్టుచీర తెచ్చి పెట్టు. వదినకు తెలుసు నాకు ఎట్లాంటిది కావాలో... నువ్వు, వదిన, పిల్లలు త్వరగా రండి..." రాణి రాసిన ఉత్తరం టేబిల్ మీద రెప రెప లాడుతోంది.

ఒక సమస్య పరిష్కారమైంది.

కానీ... ఏం జరిగితే "ఇది" జరిగింది?!

పాతాళంలో తేజోవతిగా ప్రవహించే గంగ, భూమిపై మందాకినిగా, ఆకాశంలో వియద్గంగగా రూపు దాలుస్తుందిట.

బీడుపడిన సాటి స్త్రీ జీవితం మీద అనుభూతుల్ని నీరుగా మార్చి ప్రవహించి, జీవం పోసి, మొలకెత్తించి, మెదలకుండా పారుతూ, జీవనగతిలో దార్శనికతను వెతుక్కుంటూ వెళ్లిపోయి వియద్గంగగా మారిన "మందాకిని"ని తలుచుకుంటూ కూర్చున్నాడు కశ్యప్ చాలాసేపు...

('రచన' మాసపత్రిక)